ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేయాలి

- జిల్లా కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 21: మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో సీపీ అనురాధతో కలిసి ఇంటర్ విద్య, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీస్, రవాణా, వైద్యం, ఆరోగ్యం, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మార్చి 5నుంచి 25 వరకు ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. జిలాలో 43 పరీక్షా కేంద్రాల్లో 20,595 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరిలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 9,770 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 10,815మంది ఉన్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు, ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు, మరుగుదొడ్లు, తదితర వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

కామన్ డైట్ మెనూ తప్పకుండా అమలు చేయాలి: కలెక్టర్

కామన్ డైట్ మెనూ తు.చ. తప్పకుండా అమలు చేయాలని కలెక్టర్ మనుచౌదరి హాస్టల్ వెల్ఫేర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బీసీ వెల్ఫేర్ వసతి గృహ సంక్షేమ అధికారులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ వసతి గృహాల్లో కామన్ మెనూ ఇంప్లిమెంటేషన్, ఇంప్లిమెంటేషన్‌లో ఎదురయ్యే సమస్యలపై సమీక్ష నిర్వహించారు. అల్పాహారం వండేందుకు సరిపడా వంటపాత్రలు లేవని, వాటిని సమకూర్చాలని, కూరగాయలు, నాన్‌వెజ్, ఫ్రూట్స్, పాలు, పెరుగు టెండర్ ద్వారా సప్లై చేయాలని అధికారులు కలెక్టర్‌ను కోరారు. జిల్లాలోని బీసీ వసతి గృహాల్లో సమస్యలను తెలుసుకొని నివేదిక అందించాలని ఇన్‌చార్జి బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, డీఆర్‌డీఓ నాగరాజమ్మను కలెక్టర్ ఆదేశించారు.

బీరప్ప కల్యాణానికి రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

కొమురవెల్లి, ఫిబ్రవరి 21: మండలంలోని ఐనాపూర్‌లో వచ్చేనెల 3వ తేదీన జరిగే గొల్ల కురుమల ఆరాధ్యదైవం బీరప్ప కల్యాణానికి రావాలని శుక్రవారం ఐనాపూర్ గ్రామ గొల్ల కురుమలు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి శుక్రవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, నాయకులు ఆత్కూరి జయరాములు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల ఆంజనేయులు, గొల్లకురుమ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లాకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గొల్ల కురుమ నాయకులు

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 21: మండలంలోని వంగరామయ్యపల్లి పరిధిలోని పూల్‌నాయక్‌తండాకు చెందిన లావుడ్య దిస్లా నాయక్ కుమారుడు అనిల్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. బాధితుడు హన్మకొండలోని దవాఖానలో చికిత్స పొందుతుండగా శుక్రవారం బాధిత కుటుంబాన్ని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

అనిల్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్

పరామర్శ

బెజ్జంకి, ఫిబ్రవరి 21: మండలంలోని ముత్తన్నపేటకు చెందిన బొర్ర సురేశ్‌కుమార్ తల్లి బుచ్చవ్వ ఇటీవల మరణించగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శుక్రవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, చింతకింది శ్రీనివాస్ గుప్తా, కనగండ్ల శ్రీనివాస్, కనగండ్ల శంకర్, సారయ్య తదితరులున్నారు. అలాగే గ్రామంలోని ఎస్సీ కాలనీలో పలువురిని మాజీ ఎమ్మెల్యే అప్యాయతగా పలకరించి, కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందుతున్నాయా అని ప్రశ్నించగా, అవేవీ అందడం లేదని వారు గోడు వెళ్లబోసుకున్నారు.

మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

సార్.. రైతుభరోసా రాలేదు.. ఎప్పుడొస్తది

సెర్ఫ్ ఫార్మర్ అప్షన్ లేదంటూ అధికారుల సమాధానంతో రైతుల అసంతృప్తి

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 21: పట్టణంలోని పలువురు రైతులు రైతుభరోసా వస్తుందని ఎదురుచూస్తున్నా రైతుభరోసా సాయం మాత్రం బ్యాంక్ ఖాతాల్లో జమకావడం లేదు. 30గుంటల నుంచి రెండెకరాల లోపు ఉన్న రైతులకు రైతు భరోసా సాయం నేటికీ చేర లేదు. దీనిపై హుస్నాబాద్‌లో ఎల్లంబజార్‌లో ఉన్న రైతువేదిక చుట్టూ రైతులు నిత్యం ప్రదిక్షణలు చేస్తున్నారు. హుస్నాబాద్ శివారులోని రైతు పొచవేని వెంకట్రాది తనకున్న 1.16 ఎకరాల వ్యవసాయ భూమికి రైతుభరోసా రాలేదని శుక్రవారం ఏఈఓ శివరాంను సంప్రదించాడు. తనకు రైతుభరోసా సాయం ఎప్పుడు వస్తుందని, రాకపోవడానికి కారణం ఏమిటని ఆరా తీశాడు. మా దగ్గర చూసేందుకు ఎటువంటి ఆప్షన్ లేదని ఏఈఓ సమాధానం ఇవ్వడంతో సదరు రైతు అవక్కాయ్యాడు. గతంలో సెర్ఫ్‌ఫార్మర్ అనే ఆప్షన్ ఉండేదని, దాన్ని చూస్తే తెలిసేది.. కానీ ఇప్పుడు ఆ ఆప్షన్‌ను తీసివేశారని ఏఈఓ ఇచ్చిన సమాధానంతో వెంకట్రాది నిరాశతో వెనుదిరిగాడు.

ఏఈఓకు ఫిర్యాదు చేస్తున్న రైతు వెంకట్రాది

చిన్నారులకు అందని కోడిగుడ్లు

- అధికారుల తనిఖీల్లో బయటపడుతున్న వాస్తవాలు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 21: పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు కోడిగుడ్లను అందిస్తుంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా చిన్నారులు వాటికి దూరమవుతున్నారు. పౌష్టికాహారం పంపిణీపై పర్యవేక్షించాల్సిన ఐసీడీఎస్ అధికారులు తమకేం పట్టదన్నట్లుగా వ్యవహరిస్తుండడంపై పలువురు మండిపడుతున్నారు. మద్దూరు మండలంలోని రేబర్తిలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో 11మంది పిల్లలున్నారు. ఇద్దరు గర్భిణీలు, 12మంది మూడేండ్ల లోపు పిల్లలకు టీహెచ్‌ఆర్ విధానం ద్వారా కోడిగుడ్లను అందిస్తుంటారు. అయితే నాలుగు రోజులుగా సెంటర్‌కు వచ్చే పిల్లలతో పాటు గర్భిణీలు, మూడేండ్లలోపు పిల్లలకు కోడిగుడ్లు అందడం లేదు. శుక్రవారం ఎంపీడీవో రామ్మోహన్ సదరు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించగా పిల్లలకు కోడిగుడ్లు అందడం లేదనే విషయం బయటకు వచ్చింది. దీనిపై వివరణ కోసం సీడీపీవోకు లెటర్ పెట్టనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఉమ్మడి మద్దూరు మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు సక్రమంగా కోడిగుడ్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రేబర్తి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో మాట్లాడుతున్న ఎంపీడీవో రామ్మోహన్

పెట్రోల్ పంపునకు ఇంటి పన్ను విధింపు

గజ్వేల్, ఫిబ్రవరి 21: పట్టణంలో అనుమతి లేకుండా, ఐదేండ్లుగా ఇంటి నెంబర్ లేకుండా ఉన్న జగదేవ్‌పూర్ మార్గంలోని హెచ్‌పీ పెట్రోల్ పంపునకు కొలతలు వేసి శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గోలి్కండ నర్సయ్య ఇంటి పన్ను విధించారు. అదే విధంగా ప్రజ్ఞాపూర్ మార్గంలోని మరో హెచ్‌పీ పెట్రోల్ పంపు, రిలయన్స్ మార్ట్ నుండి ఇంటి పన్నులను వసూళ్లు చేశారు. ప్రజలు ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌పీ పెట్రోల్ పంపులో కొలతలు వేస్తున్న మున్సిపల్ అధికారులు

పెద్దమ్మతల్లి ఆలయానికి రూ. 3లక్షల విరాళం

వర్గల్, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని మైలారంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీపెద్దమ్మతల్లి ఆలయ కోసం చాంద్‌ఖాన్‌మక్త గ్రామానికి చెందిన దాత మేదిని జయపాల్‌రెడ్డి శుక్రవారం రూ. 3లక్షల విరాళాన్ని గ్రామ ముదిరాజ్ సంఘ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు హర్షం వ్యక్తంచేశారు.

విరాళం అందజేస్తున్న జయపాల్‌రెడ్డి

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక, ఫిబ్రవరి 21: పదవ తరగతి విద్యార్థులు ప్రణాళికతో విద్యనభ్యసిస్తేనే ఉత్తమ ఫలితాలు సాధించగలరని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం దుబ్బాక మండలంలో చీకోడు, గంభీర్‌పూర్, రామక్కపేట, లచ్చపేట, దుంపలపల్లి ప్రభుత్వ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పదవ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థుల ప్రగతి నివేదికలను ఆయన పరిశీలించారు. సబ్జెక్టుల వారిగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఎంఈవో ప్రభుదాస్ ఉన్నారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ చేసిన బీఆర్ఎస్ నేతలు

మిరుదొడ్డి, ఫిబ్రవరి 21: గ్రామీణ పల్లెల అభివృద్ధి కొరుకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ ధర్మారం గ్రామ అధ్యక్షుడు దుర్గారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మంజూరు చేసిన రూ.15 లక్షల నిధులతో మిరుదొడ్డి మండలంలోని ధర్మారంలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ప్రజల కొరకు శ్రమిస్తూ సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు యాదగిరి, నారాయణ, నర్సింహులు, యాదగిరి, భిక్షపతి, చంద్రం, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

విద్యారంగానికి నిధులు కేటాయించాలి

గజ్వేల్, ఫిబ్రవరి 21: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యరంగానికి ప్రభుత్వం 15శాతం నిధులు కేటాయించాలని కోరుతూ డీబీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం డిప్యూటి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎగొండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణులు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో కేవలం 7శాతం నిధులు మాత్రమే కేటాయించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సదుపాయాలు కరువై విద్యార్థులు సమస్యల మధ్య చదువులు సాగిస్తున్నారన్నారు.

ఎఫ్ఎస్‌టీపీని సద్వినియోగపరచుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక, ఫిబ్రవరి 21: దుబ్బాకలో ఇటీవల ప్రారంభించిన ఎఫ్ఎస్‌టీపీ(ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) మానవ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శుక్రవారం దుబ్బాకలో ఎఫ్ఎస్‌టీపీని మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. శుద్ధీకరణ యంత్రాల పని తీరు, ఎరువుల తయారీ నిర్వాహణ గురించి ప్లాంట్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇండ్లలో సెప్టిక్ ట్యాంకుల నుండి తీసిన మానవ ఘన వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో పారేయకుండా ఎఫ్ఎస్‌టీపీ కేంద్రానికి తీసుకువస్తే రీ సైక్లింగ్ ద్వారా ఎరువులుగా తయారు చేస్తారని తెలిపారు. ఈ ఎరువులు పంట పొలాలకు, నర్సరీలకు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ ఉన్నారు.

ఎఫ్ఎస్‌టీపీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

చిన్నకోడూరు, ఫిబ్రవరి 21: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోలేమని అల్లిపూర్ బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కుంభాల చంద్రశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులకు పాలన చేతకాక బీఆర్ఎస్ నేతలపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. 60 ఏళ్ల పరిపాలనలో కాంగ్రెస్ ఏనాడు ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే కష్టాలు, కన్నీళ్లు అన్నారు. రాజలింగమూర్తి చనిపోతే కేసీఆర్, హరీష్‌రావు మీద నిందలు వేయడం సరికాదని మండిపడ్డారు. కాలేశ్వరం నీళ్లు తీసుకొచ్చి మిడ్‌మానేరు, అనంతగిరి రిజర్వాయర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మ, మల్లన్నసాగర్, నిర్మించి రైతులకు ఎండకాలంలో చెరువులు, కుంటలు నింపిన ఘనత కేసీఆర్, హరీష్‌రావుకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ అధ్యక్షులు రుచితారెడ్డి, బోయ తిరుపతి, నిమ్మకాయల రాజు, పరశురాములు, నరసింహులు, అజయ్, బబ్బులు, దేవరాజు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కుంభాల చంద్రశేఖర్

చట్టం ముందు అందరూ సమానమే

- జడ్జి స్వాతిరెడ్డి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 21: చట్టం ముందు అందరూ సమానమే అని జడ్జి స్వాతిరెడ్డి అన్నారు. స్థానిక ఎన్జీవోస్ భవన్‌లో పోక్సో యాక్ట్‌పై శుక్రవారం రాత్రి న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా స్వాతిరెడ్డి మాట్లాడుతూ.. పోక్సో చట్టం 2013లో అమల్లోకి వచ్చిందన్నారు. పనిచేసేచోట మహిళల పట్ల లైగింక వేధింపులు ఉండకూడదన్నారు. లైంగిక వేధింపుల నివారణకు కార్యాలయాల్లో సంబంధిత యజమాని ఇంటర్నల్ ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేసి పూర్తి బాధ్యత తీసుకోవాలని, అలా చేయకుంటే రూ. 50 వేల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మికాంత్‌రెడ్డి, సీఐ దుర్గ అంజయ్య, రాము, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

మానసిక దృఢత్వంతో లక్ష్యసాధన

చేర్యాల, ఫిబ్రవరి 21: విద్యార్థులు మానసిక దృఢత్వంతో తమ లక్ష్యాన్ని సాధిస్తారని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్, ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ కొండా నాగేశ్వర్ అన్నారు. మండలంలోని ముస్త్యాల ఆదర్శ పాఠశాల (కళాశాల)లో శుక్రవారం 10వ తరగతి, ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో, మానసిక స్థితిని ఎలా దృఢపర్చుకోవాలనే అనే అంశంపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దానికోసం నిరంతరం కృషిచేస్తే విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జినుగు భిక్షం, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్

సిద్దిపేట, ఫిబ్రవరి 21: తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. శుక్రవారం నాడాయన సిద్దిపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. రంగధాంపల్లిలో ఓ ఇంటి యజమాని తాగునీటిని వృథా చేయడాన్ని గమనించిన ఆయన తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. తాగునీటిని సరఫరా చేయడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని, ప్రజలు గమనించాలని సూచించారు. నల్లాలకు మోటార్లు బిగించవద్దని, చెత్తను బహిరంగ ప్రాంతాల్లో వేయకుండా రోజు ఉదయాన్నే వచ్చే మున్సిపల్ చెత్త సేకరణ వాహనానికి అందజేయాలని సూచించారు. ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, పొదలు పెరిగి ఉండడం గమనించి వెంటనే స్థలం యజమానికి నోటీసులు జారీ చేయాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు.



తాగునీటి వాడకంపై ఇంటి యజమానికి అవగాహన కల్పిస్తున్న ఆశ్రిత్ కుమార్

నిందితుడి రిమాండ్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 21: సిద్దిపేట టూటౌన్ సర్కిల్ గురువారం జరిగిన హత్య కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. ఈ మేరకు సీఐ ఉపేందర్‌తో కలిసి సిద్దిపేట ఏసీపీ మధు శుక్రవారం వివరాలను వెల్లడించారు. కేసీఆర్ నగర్‌కు చెందిన బోదాస్ శ్రీనివాస్ అనుమానాస్పదంగా మృతిచెందగా, బాధితుడి భార్య సంధ్య ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేశామన్నారు. మృతుడు శ్రీనివాస్, పర్వతం రాజుల మధ్య స్నేహం ఉందని, రాజు కొంతకాలంగా కుటుంబానికి దూరంగా ఉంటున్నాడన్నారు. రాజు శ్రీనివాస్‌ను నర్సాపూర్ చౌరస్తాలో గల నూతనంగా నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌లోకి తీసుకెళ్లి, అతనికి మద్యం తాగించాడని తెలిపారు. శ్రీనివాస్ మత్తులోకి జారుకోగా, రాజు శ్రీనివాస్‌పై లైంగిక దాడి చేస్తున్న క్రమంలో ప్రతిఘటించాడు. ఈ క్రమంలో శ్రీనివాస్‌పై రాజు కర్రతో దాడి చేసి చంపి అక్కడి నుంచి పారిపోయాడని వివరించారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి రాజును పట్టుకొని జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించామన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ

ములుగు, ఫిబ్రవరి 21: దళిత సామాజికవర్గాన్ని కించపరుస్తూ అనుచిత వాఖ్యలు చేసిన పంచాయతీ కార్యదర్శిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ లత శుక్రవారం విచారణ చేపట్టారు. ములుగు మండల పరిధిలోని వాగునూతి గ్రామ పంచాయతీ కార్యదర్శి మంజుల అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో ఇటీవల ఫోన్‌లో సంభాషిస్తూ దళిత వర్గం మహిళలను అవమానిస్తూ అనుచిత వాఖ్యలు చేసింది. ఈ విషయమై కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పోలీస్ స్టేషన్‌లో, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణకు జిల్లా కలెక్టర్ ఆదేశించిన నేపథ్యంలో డీఎల్‌పీవో విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు.

ప్రపంచ భాషలకు తల్లివంటిది తెలుగు

వర్గల్, ఫిబ్రవరి 21: ప్రపంచ భాషలకు తెలుగుభాష తల్లివంటిదని వర్గల్ నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ రాజేందర్ అన్నారు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని నవోదయ విద్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ పూర్వం నుండి కూడా ప్రపంచదేశాలలో ఏభాషకు లేని గుర్తింపు తెలుగుకు ఉన్నదన్నారు. అనంతరం విద్యార్థులకు తెలుగు సామెతలు, పద్యాలు, వ్యాసరచన ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకురాలు ఝాన్సీరాణి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యార్థులకు ఘన సన్మానం

చేర్యాల, ఫిబ్రవరి 21: మండలంలోని అర్జునపట్ల పాఠశాలలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు ఉపాధ్యాయులు పద్యాల పోటీలు నిర్వహించారు. 21 మంది విద్యార్థులు రెండు రోజుల పాటు జరిగిన పోటీలలో పాల్గొని నిరంతరాయంగా సవాలు, ప్రతి సవాలును పద్యాలుగా చదివి వారి ప్రతిభను చూపించారు. ప్రతిభ చూపించిన విద్యార్థులను ఉపాధ్యాయులు సన్మానించారు. ముఖ్య అథిగా పాల్గొన్న బాలసాహిత్య కవి శ్రీవాణి సాహిత్య సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పెండోట వెంకటేశ్వర్లును సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, యశోద, రామచంద్రమూర్తి, సుదర్శన్‌రెడ్డి, గంగాప్రసాద్, కులకర్ణి, సరిత, రజిత, షాదుల్లా పాల్గొన్నారు.

చేర్యాల: అర్జునపట్లలో విద్యార్థులను సన్మానించిన ఉపాధ్యాయులు

తీయనైనది మాతృభాష

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 21: తీయనైనది మాతృభాష అని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత అన్నారు. కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటరమణ, సంపత్‌కుమార్, సాయిసురేష్, రామస్వామి, నర్సింహులు, శ్రీలత, శైలజ, రమణ పాల్గొన్నారు.

మాతృభాషను కాపాడుకోవాలి

గజ్వేల్, ఫిబ్రవరి 21: ప్రతిఒక్కరూ మాతృభాషను కాపాడుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నిక్కత్ అంజుమ్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గణపతిరావు, అధ్యాపకులు వెంకటేష్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పదో తరగతి విద్యార్థులకు 'ప్రేరణ' కార్యక్రమం

హుస్నాబాద్, ఫిబ్రవరి 21: పదో తరగతి విద్యార్థులకు గణితంలో సంపూర్ణ మెళకువలు నేర్పించేందుకు నిర్వహించే ప్రేరణ కార్యక్రమం శనివారం హుస్నాబాద్‌లోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించనున్నట్లు తెలంగాణ గణితఫోరం ప్రతినిధి మల్కిరెడ్డి మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఒక్కో పాఠశాల నుంచి ఐదు గురు విద్యార్థులను ఈ కార్యక్రమానికి పంపాలని అన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. గణిత పుస్తక రచయిత, విషయ నిపుణులు డాక్టర్ కందాల రామయ్య, ఎస్ఆర్‌జీ కాసం సంతోష్, మోటివేషన్ స్పీకర్ అనిత పాల్గొంటారని, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎఎంవో భాస్కర్, ఎంఈవోలు మనీల, రంగా అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

ప్రజలు ఐకమత్యంగా ఉండాలి

చేర్యాల, ఫిబ్రవరి 21: గ్రామాల్లో ప్రజలు ఐకమత్యంతో జీవనం సాగించాలని, ఎన్నికల సమయంలో గొడవలకు పాల్పడవద్దని ఎస్ఐ నిరేష్ కోరారు. మండలంలోని కొత్త దొమ్మాట గ్రామాన్ని శుక్రవారం ఎస్ఐ నిరేష్ పోలీస్ సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు సైబర్ నేరాలు, ఎన్నికల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 21: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబాపూలే, అంబేద్కర్, ఏపీజె అబ్దుల్ కలాం సేవారత్న అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముక్కెర సంపత్ ప్రకటనలో కోరారు. సాహిత్య, సామాజిక, వైద్య, కళా, క్రీడా రంగాల్లో సేవలందిస్తున్నవారు ఈ అవార్డులకు ద